
కల్యాణ మండపాలు..

కానరాని వసతులు

- వర్షాలకు కారిపోతున్న భవనాలు
- విద్యుత్, నీటి సౌకర్యాలు లేని వైనం
- శుభకార్యాలకు సరైన వేదిక లేక పేదల అవస్థలు



పాండ్రంగిలో వర్షాలకు కారుతున్న కల్యాణ మండపం

పాండ్రంగిలో అసంపూర్తిగా ఉన్న కల్యాణ మండపం

కొత్త కొవ్వాడలో వర్షాలకు కారుతున్న కల్యాణ మండపం

పద్మనాభం: వివాహాది శుభకార్యాలకు అనువైన వసతి లేక పద్మనాభం మండలవాసులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని పాండ్రంగి, కొత్త కొవ్వాడ కల్యాణ మండపాల్లో **మౌలిక** సౌకర్యాలు కొరవడ్డా**యి.** కనీసం తాగునీరు, **వి**ద్యుత్ సదుపాయాలు లేకపోవడంతో ఆరుబయటే వేడుకలు జరుపుకోవాల్సిన పరిస్థితి.

పాండ్రంగిలో..

పాండ్రంగిలో 2007లో కల్యాణ మండపాన్ని నిర్మించారు. ఈ మండపం నిర్మించి 18 ఏళ్ల అవుతున్నా, **నేటికీ** విద్యుత్, నీటి **సౌకర్యాలు కల్పిం**చలేదు. ఇటీవల నెల రోజుల క్రితం బోరు ఏర్పాటు చేసినా, దీనికి అనుసంధానంగా కుళాయిలు మాత్రం నిర్మించలేదు. పెండ్లి కుమారుడు, **పెండ్లి కుమార్తె విడిది** గదులకు తలుపులు లేవు. మేడపై ఉన్న గది నీరు నిల్వ ఉండిపోతోంది. దీంతో ఈ కల్యాణ మండపం ఎందుకు కొరగాకుండా ఉంది. దీనికి ప్రత్యామ్నాయంగా 2021లో రూ.2.50 కోట్లతో **కల్యాణ** మండపం **మరియు** మ్యూజియం **నిర్మాణానికి** శ్రీకారం చుట్టారు. దీన్ని అసంపూర్తిగా నిర్మించి వదిలేశారు. ద్వార బంధాలు, కిటికీలు, తలుపులు ఏర్పాటు చేయలేదు. రంగులు వేయలేదు. ఫ్లోరింగ్ చేయలేదు.

రెండు మండపాల్లో ఇదే పరిస్థితి..

రెండు కల్యాణ మండపాల్లో భోజనాలు చేసిన తరవాత చేతులు శుభ్రం చేసుకోవడానికి కుళాయిలు లేవు. మల, మూత్ర విసర్జనకు మరుగుదొడ్లు లేవు, సరైన మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో ఇవి నిరుపేదలకు వివాహాది శుభకార్యాలు చేసుకోవడానికి అనువుగా **లేవు. దీ**ని వల్ల ఇళ్ల వద్ద **ఇరు**కు స్థలాల్లోను, **ఆ**రు బయట ఖాళీ స్థలాల్లో శుభ కార్యాలు చేసుకోవాల్సిన పరిస్థితి.



పాండ్రంగి కల్యాణ మండపంలో తలుపులు లేని పెండ్లి కుమార్తె విడిది గది



అపరిశుభ్రంగా ఉన్న పాండ్రంగి కల్యాణమండపం ఆవరణ

కొత్త కొవ్వాడలో శిథిలం

కొత్త కొవ్వాడలో 2011లో నిర్మించిన కల్యాణ మండపంలో విద్యుత్ బోరు, కుళాయిలు లేవు. కిటికీ తలుపుల గ్లాసులు శిథిలమయ్యాయి. ప్రధాన ద్వారబంధం కింద భాగం శిథిలావస్థకు చేరుకోవడంతో ఇటుక బెడ్డలు పైకి కనిపిస్తున్నాయి. ఈ కల్యాణ మండపం ఆవరణం అపరిశుభ్రంగా తయారైంది. బహిర్భూమిగా వినియోగిస్తున్నారు. కల్యాణ మండపం వెనుక భాగం తుప్పలు, డొంకలతో నిండి ఉంది. లోపలి భాగం దుమ్ముధూళితో నిండి ఉంది. వర్షాలకు రెండు కల్యాణ మండపాలు కారిపోతున్నాయి.



కొత్త కొవ్వాడ కల్యాణ మండపం ఆవరణలో దట్టంగా ఉన్న తుప్పలు



కిటికీల తలుపుల గ్లాసులు పోయిన కొత్త కొవ్వాడ కల్యాణ మండపం



కొత్త కొవ్వాడ కల్యాణ మండపంలో ప్రధాన ద్వారం కింద శిథిలమై ఇలా..



కల్యాణమండపం మేడపై గది ముందు నిలిచిన వర్షపు నీరు

ఆరుబయట అవస్థలు పడ్డాం



ఇటీవలే మా అమ్మాయి పెళ్లయింది. ఊళ్లోనే కల్యాణమండపం ఉన్నా ఉపయోగం లేకుండా పోయింది. కనీసం కరెంట్, నీళ్లు కూడా లేకపోతే వేడుక ఎలా జరుపుకొంటాం. దీంతో అసంపూర్తిగా ఉన్న కల్యాణ మండపం, మ్యూజియం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో భోజనాలు పెట్టుకున్నాం. టెంట్లు వేసుకోవడానికి, నీటి కోసం చాలా ఇబ్బంది పడ్డాం. ఊళ్లో కల్యాణమండపాన్ని వినియోగంలోకి తెస్తే మాలాంటి వారికి ఎంతో ఉపయోగపడుతుంది. – పి.రామునాయుడు, పాండ్రంగి

వర్షాలకు కారిపోతోంది



మా గ్రామంలోని కల్యాణ మండపం వర్షం వస్తే కారిపోతుంది. కుళాయిలు లేవు. హ్యాండిల్ బోరు మాత్రమే ఉంది. భోజనాలు పెట్టుకునేప్పుడు చాలా నీరు అవసరం. అంత నీరు బోరు ద్వారా పట్టుకోవడానికి ఇబ్బందిగా ఉంది. మండపం కిటికీల తలుపుల గ్లాసులు పాడయ్యాయి. విద్యుత్ బోరు ఏర్పాటు చేసి, కిటికీలు, ద్వార బంధం కింద మరమ్మతులు చేపట్టాలి – ఎల్.లక్ష్మి, కొత్త కొవ్వాడ

క్లుప్తంగా

గృహ సముదాయంలో భారీ కొండచిలువ



భారీ కొండచిలువను పట్టుకున్న స్నేక్ క్యాచర్ కిరణ్

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్‌లో గురువారం అర్ధరాత్రి భారీ కొండచిలువ కలకలం రేపింది. ఇక్కడ ఓ లేఅవుట్ గృహ సముదాయంలో అర్ధరాత్రి 12 అడుగుల భారీ కొండచిలువ నివాసితులకు కనిపించింది. దీంతో ఆందోళన చెందిన గృహ సముదాయ నివాసితులు స్నేక్‌క్యాచర్ కిరణ్‌కు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న కిరణ్ ఆ కొండచిలువను చాకచక్యంగా పట్టుకోవడంతో నివాసితులు ఊపిరి పీల్చుకున్నారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో కొండప్రాంతాల నుండి నివాసాలకు ఇలాంటి కొండ చిలువలు వస్తుంటాయని కిరణ్ తెలిపారు. ఇటువంటి పాములు కనిపిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు.

శారదాంబకు ప్రత్యేక పూజలు



పూజలు అందుకుంటున్న శారదాంబ

పీఎం పాలెం: స్థానిక ఆఖరి బస్టాపు నుంచి బక్కన్న పాలెం వెళ్లే రోడ్డులో గల శృంగేరి శంకర మఠంలోని శారదాంబ, ఉమామహేశ్వరి అమ్మవార్లకు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు.

రేపటితో ముగియనున్న సంస్కృతి శిబిరం

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంపీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరం ఆదివారంతో ముగియనున్నట్టు అంబరీష దాస తెలిపారు. ఈ నెల 12వ తేదీ నుంచి 6 నుంచి 15 ఏళ్ల వయసు కలిగిన 60 మంది చిన్నారులకు ఈ శిబిరంలో సంకీర్తన, శ్లోకం, పఠనం, నాటకాల ప్రదర్శన, చిత్రలేఖనం, కథలు, ఆధ్యాత్మికం, ఆటలలో శిక్షణ ఇస్తున్నట్టు తెలియజేశారు. సంస్కృతి శిబిరంలో నేర్చుకున్న వాటిని ఆదివారం జరిగే శ్రీకృష్ణ అర్పణంలో భాగంగా చిన్నారులు ప్రదర్శిస్తారన్నారు. భక్తు లు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.


పేదలకు సరకుల పంపిణీ



పేదలకు సరకులు అందజేస్తున్న శ్రీనివాసరావు

మధురవాడ: మధురవాడ వాంబేకాలనీ ఆఖరి బస్టాప్ దగ్గర ఎలోహిమ్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, చైర్మన్ ఉరుకూటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పేదలు, వితంతువులు, నిరుపేదలకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. శుక్రవారం మధురవాడ పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 50మందికి బియ్యం, పప్పులు ఇతర సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో బెత రమ, నెమల రమణమ్మ, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

రహదారి ఆక్రమణపై జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు



రహదారిపై భవన నిర్మాణ మెటీరియల్

తగరపువలస: జీవీఎంసీ మధురవాడ జోన్ పీఎం పాలెం వద్ద అశోక్‌నగర్ 100 అడుగుల మాస్టర్ ప్లాన్ చివరి రోడ్డును స్థానికులు ఆక్రమించారని అక్కడి ఎస్సీఎస్టీ ఉద్యోగుల కాలనీ వాసులు జీవీఎంసీ కమిషనర్‌కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. ముస్లిం కాలనీ పేరుతో కొందరు రహదారిపై ఇష్టానుసారం భవన నిర్మాణ మెటీరియల్, వాహనాలను రోజుల తరబడి నిలిపి వేస్తున్నారన్నారు. ఇరుకైన ఈ మార్గంలో పాదచారులు, వాహనాలు రాకపోకలు సాగించలేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అడిగిన వారిని అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడులకు దిగుతున్నారని తెలిపారు. గతంలో మధురవాడ జోనల్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా అక్కడి అధికారులు స్పందించలేదన్నారు. ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడదాం

- జూన్ 4న 'వెన్నుపోటు దినం' విజయవంతం చేద్దాం
- వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు



పద్మనాభంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు



వేములవలసలో వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరిస్తున్న మజ్జి శ్రీనివాసరావు, నాయకులు

తగరపువలస: కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై నియోజవర్గ స్థాయిలో వచ్చే నెల నాల్గో తేదీన నిర్వహించనున్న వెన్నుపోటు దినం నిరసన ర్యాలీకి భారీ ఎత్తున వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలి రావాలని వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఆనందపురం మండలం వేములవలసలో జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు ఇంటి వద్ద శుక్రవారం జరిగిన నియోజకవర్గ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను ఏడాది పూర్తయినా అమలు చేయనందున వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జిల్లాలోనే ప్రముఖంగా భీమిలిలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. భీమిలిలో వైఎస్సార్‌సీపీ చెక్కు చెదరలేదని నిరూపించాలన్నారు. ఆరోజు భీమిలిలోని వుడా మినీ స్టేడియం వద్దకు ఉదయం 9.30 గంటలకు కార్యకర్తలు, నాయకులు తరలి రావాలన్నారు. అక్కడి నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా భీమిలి ఆర్డీవో కార్యాలయానికి ర్యాలీగా చేరుకుని నియోజకవర్గ ప్రజల తరఫున వినతిపత్రం అందిద్దామన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ నాయకులతో కలిసి వెన్నుపోటు దినం పోస్టర్ విడుదల చేశారు. అనంతరం చిన్న శ్రీను మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులను కూటమి ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీకి కావలసింది పెద్ద నాయకులు కాదని, కార్యకర్తలే అన్నారు.

ఆ బాధ్యత ప్రతి కార్యకర్తదీ..

కూటమి వైఫల్యాలను వివిధ వర్గాల ప్రజలకు తెలియజేయవలసిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. కడపలో నిర్వహించిన మహానాడు ఎందుకు నిర్వహించారో వారికే తెలియదన్నారు. అనంతరం మండలాలు, జీవీఎంసీ వార్డులు వారీగా విడివిడిగా కార్యకర్తలు, నాయకులతో మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలు, చెన్నా దాసు, ఎంపీపీలు దంతులూరి వాసురాజు, కె.రాంబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, పాండ్రంగి అప్పారావు, మండల, జీవీఎంసీ వార్డుల పార్టీ అధ్యక్షుడు బంక సత్యం, గాడు శ్రీను, మజ్జి వెంకటరావు, పాండ్రంగి శ్రీను, శిల్లా కరుణాకరరెడ్డి, జగుపల్లి ప్రసాద్, చిల్ల భాస్కరరెడ్డి, అల్లిపల్లి నరసింగరావు, జీరు వెంకటరెడ్డి, పాల రమణ, పోతిన హనుమంతరావు, పోతిన శ్రీనివాసరావు, గుడ్ల పోలిరెడ్డి, బోయి సూర్రెడ్డి, కర్రి స్వామి, అధికార ప్రతినిధి బింగి హరికిరణ్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కోరాడ అప్పలస్వామి నాయుడు, ముసలినాయుడు, పొట్నూరు చంద్రశేఖర్, డబ్బీరు ప్రశాంతి, సీహెచ్ రజని, లెంక రాంబాబు, బంక శ్రీను, షిణగం దామోదరరావు, చందక సూరిబాబు, పినిశెట్టి సింహాచలం నాయుడు, షిణగం రాంబాబు, పల్ల రమణ, చిల్ల సూర్యనారాయణరెడ్డి, పందిరి విజయ్, ఇల్లపు వెంకటరావు తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

5వేల మందితో ర్యాలీ

పద్మనాభం: జూన్ 4వ తేదీన వెన్నుపోటు దినం కార్యక్రమం సందర్భంగా ఐదు వేల మందితో నిరసన ర్యాలీని నిర్వహించనున్నామని వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని 22 పంచాయతీల నుంచి మోటార్ బైక్‌లు, ఆటోలు వంటి వాహనాల్లో భారీగా ర్యాలీకి తరలి రావాలని కోరారు. పద్మనాభం జంక్షన్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదికే ప్రభుత్వం పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. నాయకులు క్షేత్ర స్థాయిలో ప్రజలతో మమేకం కావాలన్నారు. ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చకపోవడంపై ప్రజల పక్షాన పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

ఆనందపురంలో నియోజకవర్గ కార్యాలయం

మండల స్థాయిలో నెలకోసారి పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించాలని మజ్జి శ్రీను సూచించారు. పార్టీ నియోజకవర్గ కార్యాలయాన్ని ఆనందపురంలో ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికలకు కార్యకర్తలు సన్నద్ధం కావాలన్నారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, బోని అప్పల నాయు డు, సన్యాసినాయుడు, నాయకులు సుంకర బంగారప్పడు, సిరుగుడి ఆదినారాయణ, ఈర్ల ఈశ్వరరావు, బుగత సత్యనారాయణ, తాలాడ పద్మనాభం, బేపల గురునాయుడు,అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తీరప్రాంత భద్రతకు మత్స్యకారులు సహకరించాలి



సమావేశంలో పాల్గొన్న మత్స్యకారులు

భీమునిపట్నం: తీరప్రాంత భద్రత విషయంలో మత్స్యకారుల సహకారం ఎంతో అవసరమని మెరైన్ ఎస్ఐ మురళీకృష్ణ అన్నారు. ఆ ప్రాంతాల్లో అనుమానం కలిగించే విధంగా ఎవరైనా ఉంటే వెంటనే తమకు గానీ, పోలీసులకు గానీ సమాచారం ఇవ్వాలని సూచించారు. స్థానిక ఎగువపేట, బోయివీధికి చెందిన మత్స్యకారులతో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వచ్చే నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు ప్రధాని మోదీ వస్తున్న నేపథ్యంలో తీర ప్రాంత భద్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని, దీనికి అందరూ తమవంతు సహకరించాలని కోరారు. అలాగే, చేపల నిషేధ సమయంలో నిబంధనలు పాటించాలని సూచించారు. పెద్ద వలలు వినియోగించవద్దని తెలియజేశారు. సమావేశంలో మత్స్యశాఖ అధికారులు, మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

వర్షాలకు బంతి రైతులు విలవిల



ఆనందపురం ఫ్లై ఓవర్ కింద పారబోసిన బంతి పువ్వులు

తగరపువలస: వర్షాలకు తోడు అన్ సీజన్ కారణంగా బంతిపువ్వుల రైతు నిండా మునిగిపోయాడు. ప్రస్తుతం హోల్‌సేల్ మార్కెట్‌లో కిలో బంతి పువ్వుల ధర రూ.120 ఉండగా రూ.50లకు కూడా కొనే నాథుడు కరువయ్యాడు. అకాల వర్షాల కారణంగా తడిచిన బంతి పువ్వులు నిల్వ కూడా ఉండకపోడవంతో ఏరోజుకు ఆ రోజు విక్రయం కాని బంతి పువ్వులను రైతులు పారవేయవలసి వస్తోంది. శుక్రవారం ఆనందపురం మండలం వేములవలస పువ్వుల మార్కెట్‌కు తీసుకువచ్చినా విక్రయం కాకపోవడంతో చాలామంది రైతులు వాటిని చుట్టుపక్కల ప్రాంతాలలో విసిరేసి వెళ్లిపోయారు. పెట్టుబడి ఖర్చులు కూడా రాకపోవడంతో పువ్వుల ఏరివేత, రవాణా దండగ అని రైతులు వాపోతున్నారు. దీంతో బంతి సాగుకు తాత్కాలికంగా బ్రేకులు పడినట్టయింది. ఎండలు కాస్తే తప్ప మార్కెట్‌కు బంతి పువ్వులు తీసుకురావడం కష్టమే.

ఎన్‌సీసీ క్యాడెట్లకు అభినందనలు



సర్టిఫికెట్‌లతో చంద్రపాలెం హైస్కూల్ ఎన్‌సీసీ క్యాడెట్లు

మధురవాడ: ఇటీవల నిర్వహించిన ఎన్‌సీసీ ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని పూర్తి చేసుకున్న క్యాడెట్లను చంద్రంపాలెం హైస్కూల్ హెచ్‌ఎం రవి అభినందించారు. పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో వీరికి సర్టిఫికెట్‌లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీ విద్యార్థులకు దేశభక్తి, జీవన నైపుణ్యాలు, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, టీం వర్క్ నేర్పిస్తుందన్నారు. వీరు సమాజంలో తిరిగే భారత సైన్యం వంటి వారన్నారు. ఈ శిక్షణను కాలేజీలో కూడా కొనసాగించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ కో–ఆర్డినేటర్ తులసి ప్రత్యేక మాస్ పరేడ్ చేయించారు. కార్యక్రమంలో పీడీ నాగమణి, సీఆర్‌పీ రాంబాబు పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై యునిసెఫ్ సభ్యురాలి ఆరా



కిశోర బాలికలతో మాట్లాడుతున్న యునిసెఫ్ సభ్యురాలు మేరీ జోన్స్

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం, గొంతినవానిపాలెం గ్రామాలలో అంగన్వాడీ కేంద్రాలను యూనిసెఫ్ సభ్యురాలు మేరీ జోన్స్ శుక్రవారం సందర్శించారు. ఈ నెల 2 నుంచి అంగన్వాడీ కేంద్రాలలో ప్రారంభమైన కిశోరి వికాసం ఎలా అమలు అవుతోందని కిశోర బాలికలను అడిగి తెలుసుకున్నారు. ఏయే అంశాలు నేర్చుకున్నారో వారి మాటల్లో చెప్పించారు. జూన్ 10 వరకు కొనసాగనున్న ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అర్బన్ సీడీపీవో శ్రీలత, ఐసీపీఎస్ మమత, భీమిలి ప్రాజెక్ట్ పీవో శ్రీదేవి, సూపర్‌వైజర్లు పీవీవీ రత్నం, బి.సరిత, అంగన్వాడీలు, ఆశ కార్యకర్తలు, కిశోరబాలికలు పాల్గొన్నారు.

యోగాపై క్విజ్ పోటీలు

తగరపువలస: చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఫిజికల్ డైరెక్టర్ చిల్ల వెంకటరెడ్డి, సీఆర్‌ఎంటీ టి.త్రినాథ్ నిర్వహించిన ఈ పోటీలలో గ్రూప్ బీకి చెందిన ఎస్.వర్షిత, పి.తన్మయి, వై.ఆర్షిత్ సాయి, బి.భవదీప్ గెలుపొందారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అభియాన్ పీఈటీ మేరీగోల్డ్ తదితరులు పాల్గొన్నారు.

నైజీరియాలో పెట్టుబడి అవకాశాలపై సదస్సు



నైజీరియా ఎగ్జిక్యూటివ్ గవర్నర్ మల్లం ఉమర్ ఎ.నానుడిని సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

కొమ్మాది: నైజీరియాలో వ్యవసాయం, నీటి పారుదల, ఫుడ్ ప్రాసెసింగ్, డైరీ, పశువులు, పౌల్ట్రీ, ఆక్వాకల్చర్, ఆరోగ్య సంరక్షణ తదితర రంగాలలో విస్తృతమైన పెట్టుబడి అవకాశాలపై శుక్రవారం గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో సదస్సు నిర్వహించారు. జిగావా స్టేట్ డెలిగేషన్ ఎగ్జిక్యూటివ్ గవర్నర్ మల్లం ఉమర్ ఎ నానుడి నేతృత్వంలో అధికార ప్రతినిధి బృందం ఈ సదస్సులో పాల్గొంది. జిగావా స్టేట్స్‌లో అవకాశాల గురించి సమగ్రంగా అవలోకనాన్ని అందించారు. ఏపీ చాంబర్స్ విశాఖ జోన్ వైస్ చైర్‌పర్సన్ ఎ.లీలారాణి, మహిళా విభాగం చైర్ పర్సన్ వై.గీతాశ్రీకాంత్, వివిధ పరిశ్రమల ప్రతినిధులు, కాబోయే పెట్టుబడిదారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నైజీరియా ఎగ్జిక్యూటివ్ గవర్నర్‌ను గీతం ప్రొఫెసర్ వై.గౌతంరావు సన్మానించారు.

పార్కు స్థలంలో కరెంటు మీటరుపై ఫిర్యాదు

మధురవాడ: జీవీఎంసీ పార్కు స్థలాన్ని ఆక్రమించి చేపట్టిన అక్రమ నిర్మాణానికి కరెంటు మీటరు ఇవ్వడంపై సామాజిక కార్యకర్త చేకూరి రజని మధురవాడ విద్యుత్ సబ్ స్టేషన్ ఏఈ శైలజకు ఫిర్యాదు చేశారు. మధురవాడ బ్రహ్మం గారి ఆలయం వద్ద గల జీవీఎంసీ పార్కుకి కేటాయించిన స్థలంలో అక్రమ నిర్మాణానికి కృష్ణవేణి పేరిట (ఎస్‌సీ4523 నెంబరుతో) కరెంటు కనెక్షన్ ఇచ్చారన్నారు. ప్రభుత్వస్థలానికి ఎలా కరెంటు మీటరు ఇచ్చారో అర్థం కావడం లేదన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

దంచికొట్టిన వాన



నగరంపాలెం నుంచి వాంబేకాలనీకి వెళ్లే రోడ్డుపై..

పీఎం పాలెం: శుక్రవారం సాయంత్రం వర్షం దంచి కొట్టడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. కారు షెడ్ కూడలి నుంచి కొమ్మాదికి వెళ్లే సర్వీస్ రోడ్లలో నీరు కాల్వల్లా ప్రవహించింది. 80 అడుగుల ప్రధాన రహదారి జలమయం కావడంతో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు.

రేపు తొట్లకొండపై యోగాంధ్ర

మహారాణిపేట: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆదివారం తొట్లకొండలో 'యోగాంధ్ర' కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంలో ఉదయం 6.30 నుంచి 8 గంటల మధ్య యోగాసనాలు వేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ నేవీ, స్వయం సహాయక బృందాల సభ్యులు, వివిధ యోగా సంఘాల సభ్యులు, జిల్లా అధికారులు సహా సుమారు వెయ్యి మంది పాల్గొంటారు. జిల్లా పర్యాటక శాఖాధికారి నేతృత్వంలో యోగాంధ్ర వేడుకలు నిర్వహించాలని, మిగిలిన శాఖల అధికారులు సహాయ సహకారాలు అందించాలని, సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ శుక్రవారం సాయంత్రం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు.

ఏషియన్ అథ్లెటిక్ చాంపియన్ జ్యోతికి అభినందన



జ్యోతిని అభినందిస్తున్న ఎమ్మెల్యే గంటా

తగరపువలస: ఇటీవల దక్షిణకొరియాలోని గుమిలో జరిగిన ఏషియన్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ 100 మీటర్ల హర్డిల్స్‌లో బంగారు పతకం సాధించిన ఎర్రాజి జ్యోతిని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్రవారం తన నివాసంలో అభినందించారు. భీమిలి మండలం మజ్జిపేటకు చెందిన జ్యోతి ఈ పోటీలలో 12.96 సెకండ్లలో పూర్తి చేసి సరికొత్త రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే. ఇండియన్ ఫాస్టెస్ట్ ఉమన్‌గా పేరొందిన జ్యోతి అర్జున అవార్డు గ్రహీత కూడా.